క్లుప్తంగా

కోలాహలం.. రథోత్సవం



రథంపై సోమేశ్వరస్వామి

పుంగనూరు: పట్టణంలోని నగిరివీధిలో వెలసిన సోమేశ్వరస్వామి రథోత్సవం శనివారం కనులపండువగా సాగింది. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా అర్చకులు స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను రథంపై అధిష్టింపచేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు రథాన్ని లాగి పునీతులయ్యారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

శాంతిపురం: మండల కేంద్రం సహా కెనమాకులపల్లి పంచాయతీలో పారిశుద్ధ్య పనులను గత నాలుగు రోజులుగా ముమ్మరంగా చేస్తున్నారు. కేజీఎఫ్ రోడ్డు పక్కన చిన్నేటి వంక వద్ద ఉన్న డంప్ యార్డును కెనమాకులపల్లి సమీపంలోని ప్రభుత్వ భూమిలోకి తరలిస్తున్నారు. శాంతిపురంలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించే పనులను జేసీబీలు, పారిశుద్ధ్య కార్మికులతో చేస్తున్నారు. పంచాయతీ సర్పంచ్ ఏవీ జయరాం, కార్యదర్శి అశ్వతనారాయణ పనులు పర్యవేక్షించారు.

కమనీయం.. కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చౌడేపల్లె: మండల కేంద్రంలోని బజారువీధిలో వెలసిన రామమందిరంలోని సీతారాముల ఉత్సవమూర్తులకు ఉభయదారులు బొగ్గరపు సుబ్రమణ్యంశెట్టి, ఉషారాణి కుటుంబీకుల ఆధ్వర్యంలో శనివారం కనులపండువగా కల్యాణోత్సవం జరిగింది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వేడుకగా రాళ్లగంగమాంబ రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

గుడుపల్లె: ప్రసన్న రాళ్లగంగమాంబ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం వేడుకగా నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం రథాన్ని రంగు రంగుల వస్త్రాలు, పచ్చటి తోరణాలతో ముస్తాబు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలతో వేద పండితులు మంత్రోత్సాహంతో రథోత్సవంపై అమ్మవారిని కొలువుదీశారు. భక్తులు గోవింద నామస్మరణంతో ఆలయం చుట్టూ రథాన్ని లాగారు.

వైభవంగా తిమ్మరాయస్వామి కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుడుపల్లె: సంగనపల్లెలోని శ్రీదేవి భూదేవి సమేత తిమ్మరాయస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత తిమ్మరాయస్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. స్వామి వారికి వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని కనులారా వీక్షించి పునీతులయ్యారు. రాత్రి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.

తులసీనాథంనాయుడు దంపతులకు సన్మానం



తులసీనాథంనాయుడు దంపతులను సన్మానిస్తున్న నేతలు

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవల ఉగాది పురస్కారాన్ని అందుకున్న పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు దంపతులను స్థానిక పలమనేరు పరిరక్షణ సమితి, ఏపీ ఎన్జీఓలు శనివారం వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పీపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లై, నరసింహులు, ఏపీఎన్జీఓ నేత ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

మస్క్‌మిలాన్ సాగులో రైతుల అవగాహన లేమి అటు వారికే కాకుండా వ్యాపారులకూ శాపంగా పరిణమిస్తోంది. నష్టాలను తెస్తోంది. పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో ప్రస్తుతం సాగవుతున్న మస్క్‌మిలాన్ (కర్బూజ లాంటిది) పంట సాగుకు మితిమీరిన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం మన్నికపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. వారం పదిరోజులు ఉండాల్సిన కాయలు రెండు, మూడు రోజులకే చెడిపోతున్నాయి. ఫలితంగా మొన్నటి వరకూ టన్ను రూ.6వేల వరకూ ఉండగా ఇప్పుడు రూ.4వేలకు పడిపోయింది. ఉత్తరాది రాష్ట్రాలకు కూడా ఎగుమతులు నిలిచిపోయాయి.

రెండ్రోజులకే.. కుళ్లిపోతున్న మస్క్ మిలాన్..!



కాయలను లోడింగ్ చేస్తున్న దృశ్యం

- సాగులో అధికంగా ఎరువులు, మందుల వాడకమే కారణం
- పంట సాగుపై రైతన్నలకు అవగాహన లేమి
- సరుకుకొని నష్టపోతున్న వ్యాపారులు
- బయటి రాష్ట్రాలకు ఆగిన రవాణా
- ధరలు మరింత తగ్గే పరిస్థితి

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో వేసవిలోనూ ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. దీంతో మస్క్ మిలాన్ పంట సాగుకు ఇక్కడి వాతావరణం అనుకూలిస్తోంది. ఐదేళ్ల క్రితం కర్ణాటకకు చెందిన ప్రైవేటు కంపెనీలు కాంట్రాక్టు ఫార్మింగ్‌లో భాగంగా వాళ్లే విత్తనాలు ఇచ్చి ఇక్కడి రైతులకు పంటను పరిచయం చేశారు. వీటిని ఎక్కువగా ఢిల్లీ, ముంబై, పుణె తదితర ఉత్తరాది ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ఇది 70 రోజుల పంట కావడంతో పలువురు దీని సాగుపై ఆసక్తి చూపారు. ప్రస్తుతం డివిజన్‌లో 500 ఎకరాల వరకూ సాగులో ఉంది. అయితే చాలామంది రైతులకు ఈ పంట సాగుపై అవగాహన లేదు.





పలమనేరులో పండుతున్న మస్క్ మిలాన్ (ఇన్‌సెట్‌లో) కుళ్లిపోతున్న కాయ

అలాగే కొత్తరకం పంట కావడంతో ఇక్కడి ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు సైతం తగు సలహాలు– సూచనలు ఇవ్వలేదు. దీంతో ఏ తెగులు నివారణకు ఏ మందు వాడాలో తెలియని రైతులు ఇక్కడి ఎరువుల దుకాణదారులు చెప్పినట్టు మోతాదుకు మించి మందులను వాడారు.

రెండు, మూడురోజులకే దెబ్బతింటున్న కాయలు

ఇక్కడ పండిన మస్క్ మిలాన్ ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఆ ప్రాంతాలకు సరుకు చేరడానికి కనీసం మూడు, నాలుగు రోజుల సమయం పడుతుంది. సాధారణంగా మంచిగా పెరిగిన కాయలు కర్బూజ లాగే పది నుంచి 15 రోజుల వరకూ నిల్వ ఉంటాయి. కానీ విచక్షణారహితంగా మందులు, ఎరువుల వాడకంతో విషతుల్యమై కాయలు త్వరగా చెడిపోతున్నాయి. దీంతో సరుకు కొన్న వ్యాపారులు మార్గ మధ్యంలోనే వాసన చూసి వీటిని పడేస్తున్నారు. ఒకవేళ సరుకు ఆయా రాష్ట్రాలకు చేరినా అక్కడి వ్యాపారులు కాయలున్న స్థితిని తిరస్కరిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం నుంచి మస్క్‌మిలాన్ కొనేందుకు ఆయా రాష్ట్రాల వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు.

> **మస్క్‌మిలాన్ మాకొద్దు సామీ!**
>
> 
>
> నేను ఐదేళ్లుగా మస్క్‌మిలాన్ కాయలను కొని పలు రాష్ట్రాలకు అమ్ముతున్నా. కానీ ఈ సారి రైతులు పంటకు అనవసరంగా క్రిమి సంహారకాలు, మోతాదుకు మించి ఎరువులను వాడి కాయలు నిల్వ ఉండకుండా చెడిపోయేందుకు కారణమయ్యారు. ఇలాంటి సరుకును కొని ఇప్పటికే చాలా నష్టపోయాం. అందుకే ఇక్కడ సరుకు కొనడం లేదు. లోకల్‌గా దీనిని పెద్ద డిమాండూ లేదు. ఉన్న రాష్ట్రాలకు రవాణా చేద్దామంటే సరుకు నిల్వ ఉండడం లేదు.
>
> –గౌస్, మస్క్‌మిలాన్ వ్యాపారి, పలమనేరు
>
> **రైతులకు అవగాహన కల్పిస్తూనే ఉన్నాం**
>
> 
>
> ఏ పంట సాగు చేసినా మితిమీరిన మందులు, ఎరువులను వాడరాదని రైతులకు చెబుతూనే ఉన్నాం. కానీ రైతులు వారికి తోచినట్టు సేద్యం చేస్తున్నారు. అసలు యూరియా వాడకండని చెబుతున్నా అన్ని పంటలకూ విపరీతంగా వేస్తున్నారు. దీని కారణంగానే ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలోనూ దీనిపై రైతులకు అవగాహన కల్పించేలా సిబ్బందికి ఆదేశాలిస్తాం.
>
> –మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి

ఫలితంగా ధరలు అమాంతంగా తగ్గుముఖం పట్టాయి.

రైతులకు తప్పని నష్టం

ఎకరా పొలంలో ఈ పంటను సాగుచేయాలంటే రూ.1.5లక్షలు వ్యయం చేయాలి. దిగుబడి బాగా వస్తే ఎకరాకు 20 టన్నుల వరకూ వస్తుంది. ఇప్పుడున్న టన్ను రూ.4వేలతో ఎకరాకు రూ.80 వేలు మాత్రమే వచ్చే పరిస్థితి ఉంటోంది. పంట సాగులో చేసిన తప్పిదాలే వారికి శాపమై పెట్టుబడి కూడా దక్కకుండా పోతోంది.

నోటీస్ బోర్డు

14న మెగా వైద్యశిబిరం

పుంగనూరు: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అబ్దుల్‌కలామ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన సప్తగిరి హాస్పిటల్ వారి సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పట్టణంలోని చింతలవీధిలోని మున్సిపల్ స్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి శిబిరం జరుగుతుందని తెలిపారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

శాంతిపురం: తులసినాయనపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూలులో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 20న జరగాల్సిన ప్రవేశ పరీక్షను 21న నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఎండీకేవీ లత తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ మార్పును గమనించాలని కోరారు. ఈనెల 20న ఈస్టర్ పండుగ కారణంగా ఆ రోజు జరగాల్సిన పరీక్షను ఒకరోజు ఆలస్యంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఆదేశించారని చెప్పారు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కుప్పం పీఈఎస్ వారి ఆధ్వర్యంలో మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఘనంగా హనుమజ్జయంతి

పులిచెర్ల(కల్లూరు): హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని హమతుకువారిపల్లె, చెరువు ముందరపల్లెల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమంతుని విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



సీఐకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

- జర్నలిస్టుల భారీ ర్యాలీ

పుంగనూరు: కూటమి ప్రభుత్వ అక్రమాలను వెలికితీసి సాక్షిలో కథనాలుగా ప్రచురించడంతో కలంపై కక్షకట్టింది. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, మరో అరుగురు విలేకరులపై కేసులు నమోదు చేశారు. ఇందుకు నిరసనగా శనివారం పుంగనూరు నియోజకవర్గంలోని సాక్షి విలేకరులు పి.ఎన్.ఎస్.ప్రకాష్, వసంత్‌కుమార్, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం, స్థానిక అధ్యక్షుడు సతీష్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, సాక్షి ఎడిటర్, విలేకరులపై కేసులు ఉపసంహరించుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టణంలో ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుని, అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అలాగే సీఐ రామ్‌భూపాల్‌కు వినతి పత్రం సమర్పించారు. కేసులు తక్షణం ఉపసంహరించుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టులు రసూల్, మణిబాబు, హిదయతుల్లా, చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, రెడ్డిప్రసాద్, శ్రీనివాసులు, అప్ప, సతీష్, సైపుల్లా, కార్తీక్, పురుషోత్తం, రెడ్డెప్ప, రాజేష్, భానుప్రకాష్, మహ్మద్, జగన్, మహేష్, లోకేష్, దీపక్, యహతేశ్యామ్, మహేష్‌కుమార్, లక్ష్మీనారాయణ, షామీర్, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

చౌడేపల్లె కళాశాల ప్రభంజనం



సానియా నందిని

చౌడేపల్లె: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో కళాశాలలో 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయప్రకాష్ శనివారం తెలిపారు. 75 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో 69 మంది పాసైనట్లు తెలిపారు. కళాశాల టాపర్‌గా ఎస్.సానియా ఎంపీసీ (924), ద్వితీయస్థానం టి నందిని బైపీసీ(910) తృతీయ స్థానం ఎన్. జశ్వంత్ సీఈసీ 833 మార్కులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 76 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. పరీక్షలకు71 మంది హాజరుకాగా 54 మంది పాసైనట్లు తెలిపారు. లహరి సీఈసీ(466) జి. సంతోష్ ఎంపీసీ(369) ఈ ఆయేషా బైపీసీ(389) మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.

స్కూల్ ప్లస్‌లో వందశాతం ఉత్తీర్ణత..

స్థానిక ఉన్నత పాఠశాలలోని స్కూల్ ప్లస్‌లో ఇంటర్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ నాగరాజరెడ్డి తెలిపారు. ఎంపీసీ విద్యార్థిని బి.రజని (907), అమృత వర్షిణి (902), చంద్రిక 811 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. వందశాతం ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలిచారు. బస్టాండులో కలిసి సంబరాలు చేసుకున్నారు.

అర్ధగిరిలో పున్నమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం పొంగని పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం చందనాలంకరణలో స్వామి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పౌర్ణమి వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల విజయకేతనం

పుంగనూరు: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో మండలంలోని అడవినాథునికుంట గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. మొదటి సంవత్సరంలో 84 మంది విద్యార్థులకుగాను 68 మంది ఉత్తీర్ణులై 81 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రమ తెలిపారు. అలాగే రెండవ సంవత్సరంలో 56 మంది విద్యార్థులకుగాను 52 మంది ఉత్తీర్ణులై 92 శాతం ఫలితాలు సాధించారని ఆమె తెలిపారు. అలాగే పట్టణంలోని నక్కబండలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో జాస్మిన్ 971 మార్కులు, కల్యాణి 963 మార్కులు, మెహర్‌తాజ్ 943 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో అస్మ 484 మార్కులు, అఫ్రీన్ 483 మార్కులు, విష్ణుప్రియ 479 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.



కస్తూర్బా పాఠశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థినులు

మాజీ ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ



వి.కోటలో కేక్ కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు

వి.కోట: మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పుట్టినరోజు పురస్కరించుకుని ఎంపీపీ యువరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు ఆధ్వర్యంలో మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పేదలకు అన్నదానం, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. స్థానిక సాయిగార్డెన్ సీటి మానస వికలాంగుల పాఠశాల విద్యార్థులకు నిత్యవసర సరుకులు అందజేశారు. అదేవిధంగా సర్పంచ్ పీఎన్ లక్ష్మీ స్వగృహంలో కేక్ కట్ చేయించి అందరికి పంచి పెట్టారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని ఏటీఎం సర్కిల్ వద్ద మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పుట్టినరోజు వేడుకలను శనివారం పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కొలమాసనపల్లి, పెంగరగుంటలలోనూ జరిగింది. అక్కడి నేతలు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అదేవిధంగా పెద్దపెంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల్లో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



పలమనేరులో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న పార్టీ శ్రేణులు



గంగవరం: వైఎస్సార్ విగ్రహానికి నివాళి

గంగవరంలో..

గంగవరం: మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం ఎదుట దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ, ముస్లిం ఐక్యవేదిక నాయకులు సంయుక్తంగా డిమాండ్ చేశారు. గాంధీ విగ్రహం వద్ద శనివారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిరంకుశ వైఖరి మానుకోవాలన్నారు. దేశంలో మతాలు, రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య బీజేపీ చిచ్చుపెడుతోందన్నారు. నిరుద్యోగ కల్పన, రైతులకు రెట్టింపు ఆదాయాన్ని కల్పిస్తామనే హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అవినీతి డబ్బులను వెలికి తీసి ఇంటికి రూ.15 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తానన్న మాటలు మరిచిపోయారన్నారు.

పలమనేరు విద్యార్థుల ప్రతిభ

పలమనేరు: శనివారం వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు 77శాతం ఉత్తీర్ణత సాధించి మంచి ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ కన్నయ్య తెలిపారు. ఆమేరకు ఎంపీసీలో గాయత్రి 937 మార్కులతో టాపర్‌గా నిలిచిందన్నారు. ఇక్కడి కళాశాలలో మొత్తం 325మంది పరీక్ష రాయగా వీరిలో 250మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

వి.కోటలో..

వి.కోట: ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపల్ బాలక్రిష్టారెడ్డి తెలిపారు. శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 78 మందికిగాను 58 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీ విభాగంలో మమత 922 మార్కులు, బైపీసీలో ప్రజిత్ 831 మార్కులు, సీఈసీలో హేమలత 875 మార్కులు సాధింరారన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): ఇంటర్ పరీక్ష ఫలితాల్లో బాలికలే టాపర్లుగా నిలిచారు. మండలంలోని నందవనం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో బాలికలే టాపర్లుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ తులసీరాం తెలిపారు. మొదటి సంవత్సరంలో 67శాతం, ద్వితీయ సంవత్సరం 94శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మొదటి సంవత్సరం బైపీసీలో పద్మశ్రీ 415, ద్వితీయ సంవత్సరం బైపీసీలో దివ్య 945 మార్కులు సాధించారని తెలిపారు.

శాంతిపురంలో..



ఢిల్లీప్రియ సంజన

శాంతిపురం: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మండల విద్యార్థులు తమ సత్తా చాటారు. తులసినాయనపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూలు నుంచి 96 మంది ద్వితీయ సంవత్సర పరీక్షకు హాజరుగా 93 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపీసీ విద్యార్థిని సి.ఢిల్లీప్రియ వెయ్యి మార్కులకుగాను 977 మార్కులు సాధించింది. ఇదే కాలేజికి చెందిన ఎస్.రాఘవేంద్ర 952(ఎంపీసీ), జ్యోతి 917 మార్కులు పొందారు. ఇక్కడ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన 113 మందిలో 79 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఎంపీసీ విద్యార్థిని వి.యమున 470 మార్కులకుగాను 438 మార్కులు సాధించింది. శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 123 మంది పరిక్షకు హాజరు కాగా వారిలో 112 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థిని ఎస్.సంజన 961 మార్కులు, వి నీలకంఠ 960 (ఏఅండ్‌టీ), ఎస్.వెన్నెల 950 (ఎంపిహెచ్‌డబ్ల్యు) మార్కులు పొందారు. మొదటి సంవత్సర పరీక్షలకు 104 మంది హాజరు కాగా వారిలో 75 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, కృషి చేసిన అధ్యాపకులను ప్రిన్సిపల్‌లు లత, విజయకుమార్ అభినందించారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

రొంపిచెర్ల: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రొంపిచెర్ల కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రత్యేక అధికారి సుజాత తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బి.శ్రవంతి 935 మార్కులు, వై.దీపిక 888 మార్కులు, భారతి 860 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సంలో 26 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 26 మంది ఉతీర్ణత సాధించి 100 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఇంటర్‌లో 59 మంది విద్యార్థులు పరీక్షలు రాసి 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఎంపీసీలో మహ్మద్ హసీఫ్ 450 మార్కులు, బైపీసీలో అసీఫ్ 414 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీలో కె. అపర్ణ 465 మార్కులు, ఎం.షాలిని 462 మార్కులు, సి.చందుప్రియ 442 మార్కులు సాధించారని ఆమె తెలిపారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, ప్రిన్సిపల్స్ సరళ, సుజాత అభినందించారు.

కుప్పంలో..

కుప్పం: శనివారం విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో కుప్పంలోని వివిధ విద్యా సంస్థల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ వృత్తి విద్య కళాశాలలో ఓఏ గ్రూపు మొదటి సంవత్సరంలో 500 మార్కులకుగాను అనూష 497 మార్కులు, అభినయశ్రీ 495, భవ్య 494 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ద్వితీయ సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో సుస్మిత 969 మార్కులు, తబసం 968 మార్కులు సాధించినట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



నగదు విరాళం ఇస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నిత్య అన్నదానానికి శనివారం ఓ దాత నగదు విరాళం అందించారు. విజయనగరం జిల్లాకు చెందిన శివప్రసాద్ రూ.ఒక లక్ష నగదును ట్రస్టుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు దర్శన భాగ్యం కల్పించారు. దేవస్థానం ఈవో పెంచల కిషోర్ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పలమనేరు, కుప్పం : 93981 01870

పుంగనూరు : 96524 21441